ట్రేడ్ లైసెన్స్‌కు వెనుకంజ

- విముఖత చూపుతున్న వ్యాపారులు
- రుసుము భారమే కారణం !
- ప్రతి దుకాణానికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు



హుజూరాబాద్‌లో ప్రధాన వ్యాపార కేంద్రాలకు నిలయమైన సూపర్ బజార్ ఏరియా

హుజూరాబాద్‌రూరల్: వ్యాపార కేంద్రాలుగా పేరు గాంచిన హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో ప్రతిరోజు లక్షల్లో వ్యాపారం కొనసాగుతుంది. కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు తీసుకొని వ్యాపారాలు చేస్తుంటే.. మరికొంత మంది వ్యాపారులు ఎలాంటి లైసెన్స్‌లు తీసుకోకుండానే రూ.లక్షల్లో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి, లైసెన్స్ జారీలో కొత్త రూల్స్ ఉండటంతో వ్యాపారులు లైసెన్స్ తీసుకునేందుకు విముఖత చపుతున్నారు.

పొంతనలేని లెక్క

మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ జారీలో కొత్త పంథా అనుసరించేందుకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. క్షేత్ర స్థాయి దుకాణాలు, లైసెన్స్‌ల సంఖ్యకు పొంతన కుదరడం లేదు. దీంతో పాత విధానానికి స్వస్తి పలకనుంది. ప్రధాన ప్రాంతాల్లో, అంతర్గత కాలనీల్లో వ్యాపార కేంద్రాల వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేలా చర్యలు చేపట్టనున్నారు. తద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం రాబట్టేందుకు మార్గం సుగమం కానుందని అధికారులు భావన. పట్టణాల్లో వేలాది దుకాణాలున్నా వందల్లోనే వ్యాపార అనుమతులు తీసుకుంటున్నారు. ఒక్కో దుకాణం నుంచి సుమారు రూ. 2,500 పైబడి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విభాగాలకు అనుగుణంగా రూ. 20 వేల వరకు రుసుం స్వీకరిస్తున్నారు. అతి తక్కువగా యాజమానులు అనుమతులు పొందుతుండటంతో మున్సిపాలిటీలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. సమస్యను అధిగమించేందుకు నూతన విధానాన్ని అనుసరించేందుకు రంగం సిద్ధం చేశారు.

క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలి

వాణిజ్య దుకాణాలకు హరిత రుసుం రూ. 1000 వసూలు చేస్తున్నారు. దుకాణ వైశాల్యానికి అనుగుణంగా రుసుం నిర్దేశిస్తున్నారు. వేలాది రూపాయల రుసుం భరించలేక అనేక మంది అనుమతి పత్రాలు పొందేందుకు వెనుకడుగు వేశారు. సమస్య పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక దృష్టితో క్షేత్ర స్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనుంది.

మార్పు వస్తేనే..

పట్టణాల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా నెలకు రూ. లక్షల్లో అర్జిస్తున్నారు. నయా పైసా చెల్లించకుండా మున్సిపాలిటీల ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏళ్ల నుంచి నష్టపోతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. తాజాగా సర్కారు ప్రతి దుకాణం చిత్రం సేకరించి జియో ట్యాగింగ్ చేసేలా చర్యలు చేపట్టన్నారు.



నిబంధనలు సడలిస్తే మేలు

ట్రేడ్ లైసెన్స్ జారీలో కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను చిన్నవ్యాపారుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సడలిస్తేనే మేలు. చిన్నవ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలంటే రుసుం భారం ఇబ్బంది కలిగిస్తుంది. ముఖ్యంగా అద్దె షాపులు నిర్వహించేవారు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం విషయం గమనించాలి.

- గంగిశెట్టి రాజు, బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు,



పారదర్శకత ఉండాలి

మున్సిపాలిటీలు జారీ చేసే ట్రేడ్ లైసెన్స్‌లో పారదర్శకత ఉండేలా చూడాలి. చిన్న అనుమతులతో లైసెన్స్ తీసుకొని పెద్ద వ్యాపారాలు చేసేవారికి లైసెన్స్ జారీలో అధికారులు నిబంధనలను పాటించాలి. లైసెన్స్ వలన కలిగే ప్రయోజనాల గురించి వ్యాపారులకు అవగాహన కల్పించే బాధ్యత అధికారులపై ఉంది.

- శీలం అశోక్, సీపీఎం కార్యదర్శి, జమ్మికుంట



ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

వ్యాపారాలను నిర్వహించే ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. లైసెన్స్ తీసుకోవడం ద్వారా వ్యాపార కార్యకలాపాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉం డవు. భవిష్యత్తులో బ్యాంకు ద్వారా రుణాలు పొందేందుకు సులభతంగా ఉంటుంది. లైసెన్స్‌లు కావాలనుకునే వ్యాపారస్తులు కార్యాలయంలో సంప్రదించాలి.

- సమ్మయ్య, కమిషనర్, హుజూరాబాద్ మున్సిపాలిటీ

క్లుప్తంగా

కేంద్ర మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్

సైదాపూర్: ప్రమాదవశాత్తు వికలాంగుడైన సైదాపూర్‌కు దాసరి గోపాల్‌ను ఆదివారం కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శనలో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు నుంచి సైదాపూర్, హుస్నాబాద్ వెళ్తుండగా నాయకులు సైదాపూర్‌లో మంత్రిని శాలువాతో సన్మానించారు. నాయకుల సూచన ప్రమాదంలో కాలు కోల్పోయిన గోపాల్‌ను పరామర్శించి ఎలక్ట్రికల్ వాహనం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండలంలో పార్టీ సభ్యత్వాలు పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు ముత్యాల రమణారెడ్డి, వీరమల్ల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంపాల సంతోష్, శ్రీనివాస్, సాగర్, సతీశ్ ఉన్నారు.

కుటుంబాలకు అండగా ఉంటాం



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పసిక రవీందర్‌రెడ్డి, ఎలుకపల్లి పర్శరాములు కుటుంబ సభ్యులు, బంధువులు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మక్తపల్లి గ్రామానికి చెందిన దోనపాటి సంజీవరెడ్డి, గంట హరీశ్ ఇటీవల మృతిచెందగా ఒక్కొక్కరికి యాభై కిలోల చొప్పున బియ్యం అందజేశారు. మృతుల కుటుంబాలకు రమేశ్ అన్న కానుక పేరుతో రూ.ఐదు వేల చొప్పున అందిస్తానని తెలిపారు. వెంట బేతి శ్రీనివాస్‌రెడ్డి, పెట్టం రమేశ్, సాయిల్ల కొమురయ్య, పాశం అశోక్ రెడ్డి, వరికోలు సమ్మయ్య, భీష్మాచారి, సంపత్, కొమ్ము సంపత్, రాగుల అశోక్, సంగ విజేందర్, గుడిసె శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, రంజిత్ ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గంగాధర: మండలంలోని వెలిచాల గ్రామం నుంచి గట్టుభూత్కూర్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవెని తిరుపతి ముదిరాజ్, మాజీ ఎంపీపీ జువ్వాజి హరీశ్, కొక్కరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వీర్ల నర్సింగరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్కుల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎల్లమ్మల కృష్ణ, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్ సుక్రొద్దీన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాడె సుధాకర్, ప్రభాకర్, పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను స్వాగతిస్తున్నాం

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణన సర్వేను స్వాగతిస్తున్నామని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రవితేజ అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాజిక స్థితిగతుల వివరాలు తేటతెల్లమవుతాయని, అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ సామాజిక ప్రగతి కావాల్సిన వాటాను సాధించుకోవడానికి దోహదపడుతుందన్నారు. సర్వే చేసిన వివరాల ప్రకారం అమలుకు పార్టీ పోరాడుతుందని, ప్రజలందరు సహకరించాలని కోరారు.

గణిత ప్రతిభా పోటీలకు స్పందన





విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఉపాధ్యాయులతో విద్యార్థి అఖిల్ తేజ్

చొప్పదండి: మండలంలోని రెవెల్లికి చెందిన సదిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టుకు స్పందన లభించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రలోని ఆరు జిల్లాల్లో నిర్వహించిన టెస్టుకు 4,198 మంది హాజరైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. 67 మంది విద్యార్థులను ఎంపిక చేసి రెండేళ్ల ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తామని తెలిపారు. మ్యాథ్స్ టాలెంట్ టెస్టు ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈసందర్భంగా అర్నకొండలో జరిగిన టాలెంట్ టెస్టులో సంస్థ ఫౌండర్ ముచ్చర్ల గోవర్ధన్, శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, చింతల రమేశ్, వలంటీర్లు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: గణిత పోటీల్లో హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామం జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి ఎం.అఖిల్ తేజ్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం అనురాధ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో రెండువేల మంది పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జూనియర్ కాలేజ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడని, విద్యార్థి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

రామడుగు: ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)జాతీయస్థాయి కరాటే పోటీలకు అండర్- 14 బాలికల విభాగంలో మండలంలోని గోపాల్‌రావుపేటలోని అక్షర హైస్కూల్ విద్యార్థిని కమటం అద్వైత ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించడంతో పాటు రూ.రెండువేల ప్రోత్సాహకంగా అందజేశారు. ఆటలతో పాటు చదువులో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మునీందర్, మినుకుల రాధ, మాస్టర్ రాజు ఉన్నారు.



చొప్పదండి: అర్నకొండలో విద్యార్థులతో సదిశ సంస్థ ప్రతినిధులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

మానకొండూర్: మండలంలోని రాఘవాపూర్, అన్నారం, లలితాపూర్, పచ్చనూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజేశ్వరి స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని బీఎల్‌వోలకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు

ఇల్లందకుంట: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఓ వ్యక్తిపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలంలోని రాచపల్లిలో ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మూడెత్తుల మల్లేశ్‌యాదవ్ మాట్లాడారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాంగ్రెస్ నాయకుడినని చెప్పుకుంటూ ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో పాటు రూ. వెయ్యి ఇస్తే ఇళ్లు వచ్చేలా చేస్తానని డబ్బులు వసూలు చేశాడు. ఇతడిపై హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబుకు ఫిర్యాదు చేయగా అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీ లాల్‌మహ్మద్, బెల్లం ఐలయ్యయాదవ్, అరెల్లిమోహన్, ఎండీ అప్సర్, మొగిలి రాజుకుమార్ పాల్గొన్నారు.



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లితోపాటు వివిధ గ్రామాల్లో కోతులు, వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధికుక్కలు చికెన్ సెంటర్లు, హోటళ్లు వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మరోవైపు కోతులు ఇళ్లు, ధాన్యం రాశులను చిందరవందర చేస్తున్నాయి. కోతులు,కుక్కల దాడులతో చాలా మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. రోజుల తరబడి వైద్యం చేసుకోవాల్సి వస్తుందని బిక్కుక్కుమంటున్నారు. సంబంధిత, ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, బొమ్మనపల్లి సెల్ నంబర్ 91779 67201

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

'దళితబంధు'పై రాజకీయం వద్దు

హుజూరాబాద్‌రూరల్: దళితబంధు నిధుల విడుదలపై రాజకీయం చేయొద్దని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి దళితబంధు పథకానికి సంబంధించి పూర్తిస్థాయి నిధులను ఎందుకు విడుదల చేయించలేదో ప్రజలకు తెలపాలన్నారు. డబ్బులు ఫ్రీజ్ చేయించి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేదంటే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను తిరగనివ్వమని హెచ్చరించారు. నాయకులు వంతడుపుల బాబు, మాడుగుల ఓదెలు, గడ్డం అనిల్, చెదిరం సారంగం, అంబాల కుమారస్వామి, తాట్ల భిక్షపతి, రాజు, మందరాజు, వెంకటేష్, మాట్ల అఖిల్, అంకూస్, రాంసారయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, దళితులపై దాడిని ఖండిస్తున్నాం

జమ్మికుంట: దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, దళితులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నమని దళిత నాయకుడు మంద రాజేశ్ అన్నారు. ఆదివాంర పట్టణంలో మాట్లాడారు. రెండో విడుత రానివారు రాబోమే స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. రాకేశ్, రక్షిత్, సతీశ్, కుమార్, నాగరాజు, ప్రశాంత్, అంబాల హరీశ్, శరత్, జీడి అరుణ్ పాల్గొన్నారు.

పాతపద్ధతిలో దళితబంధు ఇస్తే చాలు

అధికారంలోకి వస్తే దళితబంధు పథకంతో ప్రతి కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, గత ప్రభుత్వం ఫ్రీజ్ చేసిన రూ.ఐదులక్షలు విడుదల చేస్తే చాలని దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ ఆదివారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న దళితులను అరెస్టు, గృహ నిర్బంధం చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. దళిత సంఘాల నాయకులు రాజకీయ పార్టీల ఊబిలో పడకుండా దళితబంధు లబ్ధిదారులను ఏకం చేసి ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

శంకరపట్నం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. కేశవపట్నంలో ఆదివారం మాట్లాడారు. హామీల అమలులో నాయకులు వైఫల్యం చెందారని, భూమాత అమలుకాక ధరణితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రూ.రెండు లక్షల రుణమాఫీ,రేషన్‌కార్డులు, పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ కమిటీలను ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్లు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. 2025 డిసెంబర్ 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గ్రామాల్లో ఎర్ర జెండా ఎగురవేస్తామన్నారు. మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, రవి, రామస్వామి, తిరుపతి యుగేందర్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

గంగాధర: తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ఫౌండేషన్ సభ్యులందరికీ గామ ఫౌండేషన్ ఆర్థికంగా అండగా ఉంటుందని నియోజకవర్గ కార్యదర్శి పొత్తూరి సురేశ్, ఉపాధ్యక్షుడు గజ్జెల సతీశ్ పేర్కొన్నారు. నారాయణపూర్, గర్శకుర్తి, కురిక్యాల, మధురానగర్ గ్రామాలకు చెందిన ఫౌండేషన్ సభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని రుక్మాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని, కొనుగోలు కేంద్రానికి రైతులు పత్తిని తీసుకురావొద్దని మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి రాజేశ్వరి కోరారు. సీసీఐ ద్వారా మిల్ ర్యాంకింగ్ ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 ప్రకారం పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఖరీదుదారులు సీసీఐ, ప్రైవేటు ఖరీదును నిలిపివేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో రైతులు పత్తిని తీసుకురావొద్దని కార్యదర్శి సూచించారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా



శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలో ఆదివారం ధాన్యం ట్రాక్టర్ బోల్తా పడింది. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన చాడ సతీశ్ రెడ్డి లింగాపూర్ గ్రామంలోని రైస్‌మిల్లుకు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాల లోడుతో వెళ్తున్నాడు. మొలంగూర్ బస్టాండ్ వద్ద పిల్లి అడ్డు రాగా.. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.



జమ్మికుంట బాలుర హైస్కూల్ 1978-79 పదో తరగతి విద్యార్థులు



చిగురుమామిడి: ఇందుర్తిలో 2000-01 పదో తరగతి విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

జమ్మికుంట/చిగురుమామడి: జమ్మికుంట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల 1978-79 పదో తరగతి విద్యార్థులు, విజ్డమ్ జూనియర్ కళాశాల 2001-03 విద్యాసంవత్సరం సీఈసీ విద్యార్థులు, చిగురుమామిడి మండలం ఇందుర్తి 2000-01 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత పాఠశాల, కళాశాల ఆవరణల్లో కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగ క్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లు, లెక్చరర్స్‌ను ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్స్ రవీందర్, ప్రభాకర్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు మల్లికార్జున్, అవినాశ్, వెంకటేశ్వర్లు, మొగిలి, రమేశ్, ఇందుర్తి విద్యార్థులు రఘునాథరెడ్డి, సత్యనారయణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, సంతోష్‌కుమార్, సాంబమూర్తి, మహేందర్, మల్లయ్య, సరయ్య, సదయ్య, కుమారస్వామి, స్వప్న పాల్గొన్నారు.



జమ్మికుంట: 2001-03 విద్యా సంవత్సరం ఇంటర్ విద్యార్థులు

ఉచిత వైద్య శిబిరం



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో అపోలో రిచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్-వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఉచిత బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హాస్పిటల్ డైరెక్టర్ కళింగరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హాస్పిటల్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.